క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి గ్రామంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ పోరంకిలో రాజమాతనగర్, మహాలక్ష్మీనగర్ ఫీడర్లు మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. ఈ కారణంగా బీజేఆర్‌నగర్, నిడమానూరు రోడ్డు ప్రాంతాల్లో విద్యు సరఫరా ఉండదని స్థానికులు సహకరించాలని కోరారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీ సీపీడీసీఎల్ గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హనుమాన్‌జంక్షన్ సెక్షన్ పరిధిలోని వేలేరు రోడ్డు, రాజుల కాలనీ, హనుమాన్ నగర్, విజయవాడ రోడ్డు, కేపీఎస్ టాకీస్ రోడ్డు ఏరియాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

అష్టమ వార్షికోత్సవ ప్రత్యేక పూజలు



పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో వేంచేపి ఉన్న శ్రీ విజయరాజరాజేశ్వరి, శ్రీ విజయసుందరేశ్వరస్వామివారి దేవస్థానంలో అష్టమ వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు గోపూజ చేశారు. 6 గంటలకు శ్రీవిజయగణపతి స్వామివారికి విశేష అభిషేకం చేశారు. ఉదయం 9 గంటలకు శ్రీవాసు దేవానందగిరిస్వామీజీ ఆధ్వర్యంలో శ్రీ లలితా సహస్రనామ సామూహిక కుంకుమార్చన చేశారు. అనంతరం స్వామీజీ అనుగ్రహభాషణ నిర్వహించారు. సాయంత్రం అదిష్టాన దేవతాహోమం చేశారు. భక్తులు పూజా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ పూజా కార్యక్రమంలో 25వ తేదీ వరకు నిర్వహిస్తారు.

ఓటు హక్కుపై అవగాహన



ఉయ్యూరు: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం ఉయ్యూరు పట్టణంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహనకు ర్యాలీ నిర్వహించారు. చైర్మన్ వల్లభనేని నాని మాట్లాడుతూ ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. పౌరులు బాధ్యతతో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు సుధారాణి, వెంకయ్య, మహిళలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసన



పెనమలూరు: కేంద్ర ప్రభుత్వం వెంటనే రైతుల సమస్యలను పరిష్కరించాలనిని సీఐటీయూ నాయకుడు అమరశాస్త్రి డిమాండ్ చేశారు. ఢిల్లీలో రైతులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా సీఐటీయూ ఆధ్వర్యంలో పోరంకిలో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. రైతుల సమస్యల పై కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి అవలంభిస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఇంటిదారితుందన్నారు. మండల సీఐటీయూ కార్యదర్శి ఉప్పడ త్రిమూర్తి మాట్లాడుతూ గతంలో రైతులు ఢిల్లీలో చేసిన ఉద్యమంతో కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి న్యాయం చేస్తానని హామీ ఇచ్చిందన్నారు. అయితే నేటికి రైతుల సమస్యలు పరిష్కరించే విషయంలో కేంద్ర ప్రభుత్వం విఫలమయిందని తెలిపారు. నేతలు పుసులూరి పాతాళలక్ష్మి ,సీహెచ్.భవాని, రమణమ్మ, పోతులూరి శ్రీనివాసరావు, వాటపల్లి శ్రీరాములు పాల్గొన్నారు.

29లోగా వ్యాపార లైసెన్సులను రెన్యూవల్ చేయించుకోవాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర పాలక సంస్థ పరిధిలో వివిధ వ్యాపారాలు నిర్వహించుకునేవారు తమ వ్యాపార లైసెన్స్‌లను ఈ నెల 29వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా సంబంధిత సచివాలయాల్లో లేదా సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ట్రేడ్ లైసెన్స్ రుసుము చెల్లించి రెన్యూవల్ చేయించుకోవచ్చని నగరపాలక సంస్థ కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటివరకు సుమారుగా 60 శాతం మంది వ్యాపారస్తులు మాత్రమే వారి లైసెన్స్‌లను రెన్యువల్ చేయించుకున్నారని, మిగిలిన వ్యాపారస్తులు కూడా ఈ నెల 29 లోపు తప్పనిసరిగా రెన్యువల్ చేయించుకోవాలని సూచించింది. ఆ తరువాత అయితే 25 శాతం అపరాధ రుసుముతో లైసెన్స్‌లను రెన్యువల్ చేయించుకోవల్సి ఉంటుందని పేర్కొంది.

ప్రజారోగ్య పరిరక్షణకు జగనన్న కృషి

- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్
- మద్దూరులో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2



మద్దూరు వైద్యశిబిరంలో మందుల కిట్ అందజేస్తున్న రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్

కంకిపాడు: ప్రజారోగ్య పరిరక్షణకు సీఎం జగనన్న కృషి చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మండలంలోని మద్దూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. శిబిరాన్ని మంత్రి జోగి రమేష్ ప్రారంభించారు. శిబిరంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి ఆరోగ్య శిబిరంలో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కంటి వెలుగు కింద ఏర్పాటు చేసిన స్టాల్‌లో కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం సభలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నిర్వహించిన పాదయాత్రలో ప్రజలు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలను స్వయంగా చూసిన జగనన్న చలించిపోయి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడుకునేందుకు కంకణం కట్టుకున్నారన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీని ప్రవేశ పెట్టి రూ.5 లక్షల వరకూ వైద్యం అందేలా చేస్తే, సీఎం జగన్ రూ.25 లక్షలు వరకూ వైద్యం అందేలా పరిమితి పెంచి ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించారన్నారు.

తోడు దొంగలను తరిమికొట్టాలి..

ప్రభుత్వ సంక్షేమ పాలన చూసి ఓర్వలేక తోడు దొంగలు చంద్రబాబు, పవన్ ఏకమై దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మంత్రి జోగి రమేష్ అన్నారు. ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలన్నారు. మంచి మనసున్న సీఎం జగన్‌ను కాపాడుకోవాలని, సంక్షేమ పాలన అందాలంటే వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలోనే మద్దూరు–వణుకూరు–ఉప్పలూరు రహదారికి మోక్షం లభిస్తుందని, రూ.19 కోట్లు నిధులు మంజూరై సిద్ధంగా ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సతీష్, జెడ్పీటీసీ బాకీ బాబు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, సర్పంచ్‌లు చిప్పల రామదాసు, పి.వరప్రసాద్, ఎంపీటీసీలు వడుగు శ్రీనివాసరాలు, చిట్టూరి ప్రసాద్, కమ్మ, ఉమెన్ ఫైనాన్స్, టిడ్కో డైరెక్టర్లు రామినేని రమాదేవి, నందిపాటి బిందుమాధవి, పి.రాఘవరావు, డాక్టర్ సుధా ప్రసూజ, ఈఓ శివనాగేశ్వరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సంపూర్ణ వైద్య సేవలు

పెనమలూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు సంపూర్ణవైద్య సేవలు అందిస్తున్నామని వైద్యురాలు సుస్మిత అన్నారు. యనమలకుదురు–2 సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు సుస్మిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఉచిత వైద్య సేవలు క్షేత్ర స్థాయిలో అందించాలని జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అమలులోకి తీసుకు వచ్చిందన్నారు. వైద్య శిబిరంలో ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తామన్నారు. వ్యాధి తీవ్రతను బట్టి ఆరోగ్యశ్రీ నెట్‌వర్కు ఆస్పత్రులకు రిఫర్ చేస్తామని అన్నారు. శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పుష్పావతి, సిబ్బంది పాల్గొన్నారు.

380 మందికి వైద్య పరీక్షలు

నున్న(విజయవాడరూరల్): ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని నున్న ప్రభుత్వ వైద్య శాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.నిరంజన్ కుమార్ అన్నారు. శుక్రవారం నున్న గ్రామ సచివాలయం–3 వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష–2 ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ నిరంజన్ కుమార్ మాట్లాడుతూ వైద్యం కోసం డబ్బులేక ఎవ్వరూ బాధపడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలోనూ జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రముఖ వైద్యులతో కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను అందజేస్తున్నారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్లు చిల్డ్రన్ స్పెషలిస్ట్ డాక్టర్ జి.రాజేశ్వరి, ఆర్థోపెడిక్ డాక్టర్ వి.చంద్రిక పాల్గొని 380 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



యనమలకుదురులో మందుల కిట్‌ను అందజేస్తున్న వైద్యురాలు సుస్మిత



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కె.నిరంజన్‌కుమార్

నేడు వలంటీర్లకు వందనం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో శనివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తామని గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ తెలియజేశారు. గ్రామంలోని మూడు సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు ప్రకటించింది ఈ నేపథ్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయాల సిబ్బంది పాల్గొంటారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కృషి

హనుమాన్‌జంక్షన్ రూరల్: మహిళా సాధికారత, ఆర్థిక స్వాలంభనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ అన్నారు. స్థానిక కేఎస్ టాకీస్‌రోడ్డులోని దయాల జకరయ్య ప్రాంగణంలో డ్వాక్రా మహిళలకు 4వ విడత వైఎస్సార్ ఆసరా పంపిణీ సంబరాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. మండలంలోని 27 గ్రామాల నుంచి వేలాదిగా డ్వాక్రా మహిళలు తరలి వచ్చారు. మండలంలోని 1790 డ్వాక్రా గ్రూపులకు రూ.16.77 కోట్లు మేర వైఎస్సార్ ఆసరా ద్వారా రుణామాఫీ చేసినట్లు వివరించారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవిర్నేని శేషగిరిరావు, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

వృద్ధులు, వికలాంగులు ఇంటివద్దే ఓటు వేయొచ్చు

నియోజకవర్గ ఎన్నికల అధికారి చంద్రలీల



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి చంద్రలీల

గన్నవరం: ఎన్నికల సంఘం సూచనల మేరకు 80 ఏళ్లు దాటిన వృద్ధులు, 40 శాతం అంగవైకల్యం కలిగిన వికలాంగులు ఇంటి దగ్గరే ఓటు వేసే వెసులుబాటు కల్పించినట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి బీ చంద్రలీల తెలిపారు. ఈ సదుపాయం కోసం ఫారం–12డీ దరఖాస్తులను బీఎల్‌ఓలకు సమర్పించాలన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ ఎన్నికల అధికారిణి చంద్రలీల అధ్యక్షతన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జనవరి 22వ తేదీన ప్రకటించిన తుది జాబితా ప్రకారం నియోజకవర్గంలో 2,77,323 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఈ రోజు వరకు కొత్తగా నమోదైన 1,942 మందితో కలిపి మొత్తం ఓటర్ల సంఖ్య 2,79,265 మందికి పెరిగినట్లు తెలిపారు. ఇంకా తొలగింపులకు సంబంధించి ఫారం–7 దరఖాస్తులు 2,015, మార్పులకు సంబంధించిన ఫారం–8 దరఖాస్తులు 1,096, కొత్త ఓటర్లు నమోదుకు సంబంధించి ఫారం–6 దరఖాస్తులు 232 పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. అనంతరం ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు మార్పులు, చేర్పులపై రాజకీయ పార్టీలు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎస్ఎస్.పవన్ కుమార్, ఎలక్షన్ డీటీ ఏఎస్ఆర్.గోపాల్‌రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కే గణేష్ బాబు, నాదెండ్ల మోహన్, ఆళ్ల వెంకటగోపాలకృష్ణారావు, వింత శ్రీనివాసరెడ్డి, కళ్ళం వెంకటేశ్వరరావు, తంగిరాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సిట్రోయెన్ సీ3 ఆటోమేటిక్ కారు మార్కెట్‌లోకి



కారును ఆవిష్కరిస్తున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ఓంకార్ తదితరులు

రామవరప్పాడు: సిట్రోయెన్ కంపెనీవారు నూతనంగా ఆధునీకరించి ప్రవేశపెట్టిన సిట్రోయెన్ సీ3 ఎయిర్ క్రాస్ ఆటోమేటిక్ వెర్షన్ కారును శుక్రవారం ఎనికేపాడులోని అనిల్ మ్యానుఫ్యాక్చరర్స్ షోరూమ్‌లో ఏరియా సేల్స్ మేనేజర్ అనిరుద్ కులకర్ణి, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ఓంకార్ నగర మార్కెట్‌లోకి లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిరుద్ కులకర్ణి మాట్లాడుతూ సిట్రోయెన్ సీ3 కారు వినియోగదారుల నుంచి విశేష ఆదరణ పొందుతుందన్నారు. ఈ కారులో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, భద్రతా సౌకర్యాలతో రూపుదిద్దుకున్నట్లు వివరించారు. జనరల్ మేనేజర్ రత్న ఆనంద్ మాట్లాడుతూ 6 స్పీడ్ ఆటోమేటిక్‌తో 110 పీఎస్ పవర్, 205 ఎన్ఎం టార్క్, సిట్రోయెన్ అత్యాధునికమైన సస్పెన్షన్ ఫ్లెయింగ్ కార్పెట్ రైడ్ డిజైన్‌తో భారతదేశ రోడ్లకు సరిపడేలా రూపొందించినట్లు వివరించారు. ఈ కారు అకర్షణీయమైన 4 మోనోటోన్, 6 డ్యూయల్–టోన్స్ రంగులలో లభిస్తుందని తెలిపారు. ఈ కారు ప్రారంభ ధర రూ.12.84 లక్షల నుంచి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, వినియోగదారులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను పాటించకపోతే చర్యలు తప్పవు

అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రాజేష్



ఏఎల్‌ఓ రాజేష్‌ను సత్కరిస్తున్న రమణయ్య, సూర్యశంకర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): వ్యాపార సంస్థలు, దుకాణదారులు కార్మిక శాఖ చట్టాలను పాటించకపోతే చట్టరీత్యా చర్యలు తప్పవని విజయవాడ సర్కిల్–1 అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ తలమాల రాజేష్ హెచ్చరించారు. భవానీపురం ఐరన్‌యార్డ్‌లోగల సొసైటీ కార్యాలయంలో శుక్రవారం వివిధ వర్తక సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపార సంస్థలు/దుకాణాలకు లైసెన్స్ తప్పనిసరని, రెన్యువల్ గడువు దాటిపోతే మార్చి 2024లోపు గ్రామ/వార్డు సచివాలయాలు లేదా మీసేవ కేంద్రాల ద్వారా రెన్యువల్ చేయించుకోవాలని తెలిపారు. దుకాణాలలో గానీ, వ్యాపార సంస్థల్లో గానీ బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం నేరమని, అటువంటి వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. షాపుల్లో పనిచేస్తున్న కార్మికులందరూ (ఈఎస్ఐ, పీఎఫ్ వర్తించనివారు) ఈ–శ్రమ రిజిస్ట్రేషన్ పొంది ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హత పొందవచ్చన్నారు. సమావేశంలో విజయవాడ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రం రమణయ్య, జనరల్ సెక్రటరీ కొనకళ్ల వాసుదేవ సూర్యశంకర్, ది కృష్ణ డిస్ట్రిక్ట్ డ్రగ్ అసోసియేషన్, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రాజేష్‌ను అసోసియేషన్ సభ్యులు సత్కరించారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



చిన్నారుల నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. విజయవాడకు చెందిన వాగ్దేవి కూచిపూడి నృత్యాలయకు చెందిన నాట్యాచార్య సప్పా శివకుమార్ పర్యవేక్షణలో భవ్య, చరిష్మా, హాసిని, సాధన, లాస్యలతో పాటు పలువురు చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి అభినయాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచ హారతుల సేవ అనంతరం నిర్వహించిన ఈ ప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం అధికారులు చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: కానూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో సోదరులకు గాయాలవటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరుకు చెందిన సోదరులు తారకేష్, కార్తికేష్ గురువారం సాయంత్రం బైక్ పై కామయ్యతోపునకు వెళుతుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీ కొట్టింది. ఘటనలో బైక్ పై ఉన్న ఇద్దరు సోదరులు రోడ్డుపై పడి పోవటంతో గాయాలయ్యాయి. వారిని పోరంకిలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సకై చేర్చారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

అత్తను దూషించిన కోడలిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అత్తను దూషించిన కోడలిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కలరా హాస్పిటల్ ప్రాంతానికి చెందిన పైడిపాటి లక్ష్మి, దుర్గారావు భార్యభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. కుమారుడు దుర్గాప్రసాద్ 2015లో ప్రవల్లిక అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అయితే కొంత కాలంగా దుర్గాప్రసాద్‌కు, ప్రవల్లికకు గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దుర్గాప్రసాద్ భార్య నుంచి విడిపోయి తల్లి వద్దే ఉంటున్నాడు. ఈనెల 16వ తేదీన దుర్గాప్రసాద్ తల్లి లక్ష్మి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ప్రవల్లిక తన అత్త వద్దకు వచ్చి నోటికి వచ్చినట్లు దూషించడమే కాకుండా మీ అబ్బాయిని, మిమ్మల్ని చంపుతానని బెదిరించింది. దౌర్జన్యంగా ఇంట్లోకి వచ్చి అత్త చేతులను వెనక్కి తిప్పి పట్టుకుంది. దీంతో లక్ష్మి భయపడి కేకలు వేయగా చుట్టు పక్కల వారు వచ్చి ప్రవల్లికను మందలించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయింది. కోడలు బెదిరింపులు, దాడికి యత్నించడంపై బాధితురాలు లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన కుమార్తె కనిపించడం లేదంటూ తల్లి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీ బ్లాక్ నెం 193లో భార్యభర్తలైన బివర దుర్గా నాగేశ్వరరావు, జ్యోత్స్న(32) నివాసం ఉంటున్నారు. వీరిది ప్రేమ వివాహం. వీరికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం. ఈనెల 21వ తేదీన భార్యభర్తలిద్దరికి చిన్నపాటి గొడవ జరగడంతో జ్యోత్స్న ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్త దుర్గానాగేశ్వరరావు భార్య కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో అత్త గీతకు ఫోన్ చేసి చెప్పాడు. అత్త, అల్లుడు బంధువులు, తెలిసిన వారిని విచారించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



ఆటోనగర్(విజయవాడ తూర్పు): మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో కేక్‌ల తయారీపై శిక్షణ ఇస్తున్నట్టు కోవే ఏపీ చాప్టర్ అధ్యక్షురాలు రాధిక తెలిపారు. గత రెండు రోజుల నుంచి భారతీనగర్‌లో 50 మంది మహిళలకు కేక్‌ల తయారీపై శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ పలురకాల హోం బేకింగ్, బై మిలెట్స్‌పై శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. రకరకాలైన స్వీట్ బేకరీలను తయారు చేయిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రాగి కేక్, మిలెట్స్, చాక్లెట్, బనానా, ఓట్స్ బ్రోనింగ్, చాక్లెట్ కేక్, పైనాపిల్ కేక్‌లను తయారు చేసినట్టు చెప్పారు. గుణదలకు చెందిన స్వీట్‌వే వారితో ఈ శిక్షణ ఇప్పిస్తున్నట్టు తెలిపారు. విజయవాడ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన మహిళలు శిక్షణకు అధికంగా వస్తున్నట్టు తెలిపారు. తక్కువ ఖర్చుతో కేక్‌లు తయారు చేసి అధిక ఆదాయం పొందవచ్చన్నారు. శిక్షణ అనంతరం ఇంటి వద్దనే తయారు చేసి షాపులకు వేసే విధంగా అన్ని రకాలుగా వీరికి శిక్షణ ఇస్తున్నామన్నారు. కోవే కార్యదర్శి విజయలక్ష్మి, మోహిని, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా జీవ ధ్వజ పునఃప్రతిష్ట ఉత్సవం



జీవధ్వజ పున:ప్రతిష్ట పూజలు

ఉంగుటూరు: పొణుకుమాడులో శ్రీగంగా పార్వతీ సమేత రాజేశ్వరస్వామి దేవస్థానంలో జీవధ్వజ పునఃప్రతిష్ఠా మహోత్సవం రెండో రోజు శుక్రవారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో జీవ ధ్వజ, ద్వారపాలక, కాలభైరవ, బలిపీఠ ప్రతిష్టలు ఈ నెల 24 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 9గంటలకు గవ్యాంత పూజలు, మార్జనలు, వాస్తుపూజ, వాస్తుబలి, పర్యగ్నీకరణ, గ్రామ ప్రదక్షిణ, క్షీరాధివాసము, జలాదివాసము, తదంగ హోమాలు, నిరాజన మంత్రపుష్పాలు, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు ధాన్యాదివాసము, శాంతికుంభ స్థాపన, శాలార్చన, వస్త్ర, పుష్పాదివాసములు, పంచశయ్యాదివాసములు, మూర్తి హోమం, శాంతి హోమం, అంగ ప్రత్యంగ, దిశా, ఆదివాసంగా హోమాలు, నీరాజన మంత్ర పుష్పములు, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. పుల్లేటికుర్తి గణపతి శర్మ, పాలపర్తి ప్రేమ్‌చందుశర్మ విశేష పూజాలు చేశారు. త్రయాహ్నిక దీక్షతో సుంకర రాజేంద్రప్రసాద్, పద్మజ, సుంకర రవి, శ్రీదేవి, సుంకర రాజేష్ పద్మావతి దంపతులచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



వలంటీర్లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించటంతో వలంటీర్ల సేవలు అభినందనీయమని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ అన్నారు. స్థానిక కేఎస్ టాకీస్ రోడ్డులోని దయాల జకరయ్య ప్రాంగణంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవిర్నేని శేషగిరి రావు అధ్యక్షతన జరిగిన అభినందన సభలో మండలంలోని 27 గ్రామాలకు చెందిన వలంటీర్లకు సేవా వజ్ర, సేవా మిత్ర, సేవా రత్న అవార్డులను అందజేశారు. సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యులు కొమరవల్లి గంగాభవాని, వైఎస్సార్ సీపీ నాయకులు కాట్రు శేషు, చెరుకూరి శ్రీనివాస్, కోడెబోయిన బాబి, కిరణ్‌మూర్తి, అక్కినేని ప్రసాద్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహార ఉత్పత్తులు అందించడం అభినందనీయం



రైతు ఉత్పత్తులను పరిశీలిస్తున్న నాబార్డ్ జీఎం కె.వి.ఎస్.ప్రసాద్

పటమట(విజయవాడతూర్పు): నాణ్యమైన ఆహార ఉత్పత్తులను అందిస్తున్న రైతులను నాబార్డ్ జీఎం కె.వి.ఎస్.ప్రసాద్ అభినందించారు. నాబార్డ్ తరంగ్‌లో భాగంగా స్టెల్లా కాలేజీలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం మేళాను ఆయన శుక్రవారం సందర్శించారు. బాపట్ల సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలోని క్షేత్ర రైతు ఉత్పత్తిదారుల సంఘం, భవిత బ్లాక్ గ్రామ్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయన్నారు. నాణ్యమైన ఆహార ఉత్పత్తులను అందిస్తున్న రైతులను అభినందించారు. ఈ ప్రదర్శన శనివారంతో ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం మిలింద్ సొశాల్కర్, ఎఫ్‌పీవో సి.హెచ్.ఆల్బర్ట్ పాల్గొన్నారు.

రేపు త్రిశక్తి పీఠంలో హోమం

కృష్ణలంక(విజయవాడతూర్పు): త్వరలో జరగనున్న పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థుల పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 25వ తేదీన బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో సరస్వతీ పూజ, సరస్వతీ సహిత మేధా దక్షిణామూర్తి హోమం నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు సీహెచ్ విజయకిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఉచితంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూజలో పాల్గొన్న విద్యార్థులకు అమ్మవారి ప్రతిమ, రక్ష, ప్రసాదం పంపిణీ చేస్తామని చెప్పారు.